క్లుప్తంగా

భీమన్న దేవుని ఉత్సవాలు ప్రారంభం



భీమన్న గజాలతో భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో ఉన్న భీమన్న దేవుడి ఆలయ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్నదేవుడి గజాలతో కమిటీ సభ్యులు ఇంటింటా హారు కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23న పట్టణంలోని గోదావరి తీరంలో గంగాస్నానం, రాత్రికి బండారు బాసంతం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 24న జాతర ఉంటుందని భక్తులు ఉత్సవాలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

దండారీ ఉత్సవాలు



ఉత్సవాల్లో ఆదివాసీలు

ఖానాపూర్: దీపావళి పండుగ సందర్భంగా పలు ఆదివాసీ గ్రామాల్లో దండారీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆదివాసీలు ప్రత్యేక పూజలు చేస్తూ గుస్సాడీ నృత్యాలతో వేడుకల్లో పాల్గొంటున్నారు. మండలంలోని అడవి సారంగాపూర్, సింగాపూర్ గోండుగూడ, పంగిడి గూడెం, కొలాంగూడ, గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఆర్జీయూకేటీలో హరిత సంబరాలు



మొక్క నాటుతున్న వీసీ గోవర్ధన్, పక్కన అధికారులు

బాసర: బాసర ఆర్జీయూకేటీ కళాశాలలో ఉపకులపతి(వీసీ) ప్రొఫెసర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో హరిత సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, ఉద్యోగులతో కలిసి వీసీ మొక్కలు నాటారు. ఈసందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సమష్టిగా పాటుపడుతామన్నారు. అందరి సహకారంతో బాసర ట్రిపుల్ ఐటీని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ మురళీదర్శన్, డీన్స్ డాక్టర్ విటల్, డాక్టర్ మహేష్, పీడీ శ్యాంబాబు, గజ్జల శ్రీనివాస్, డాక్టర్ రాకేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పారాయణం



పారాయణం చేస్తున్న భక్తులు

దస్తురాబాద్: మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ ఆలయంలో శనివారం వికాస తరంగిణి ఆధ్వర్యంలో విష్ణు సహస్త్రనామ పా రాయణం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ త్రిదండి చిన్న జీయర్ 69వ తిరునక్షత్రం పురస్కరించుకొని విశ్వ శాంతి కోసం పంచాయుధ స్తోత్ర, విష్ణు సహస్తనామ పారాయణం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు నరేషాచార్యులు, వికాస తరంగిణి బాధ్యులు కొల్లూరి శ్రీనివాస్, మమత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన కోసం స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న అధికారులు

నిర్మల్‌రూరల్: మండలంలోని న్యూపోచంపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు మధ్యలో వంతెన నిర్మాణం కోసం శనివారం అధికారులు స్థలం పరిశీలించారు. గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని ఇటీవల ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ ఈఈ చందుయాదవ్, ఏఈ వేణుగోపాల్ స్థలం పరిశీలించారు. నివేదికను అందించనున్నట్లు పేర్కొన్నారు.

బీసీ బంద్ సంపూర్ణం



ఖానాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు



లోకేశ్వరంలో బంద్‌కు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



సోన్‌లో ఉన్నత పాఠశాల బంద్ చేయాలని కోరుతున్న కాంగ్రెస్ నాయకులు

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం చేపట్టిన బంద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. వ్యాపార, వాణిజ్య రంగాలతోపాటు పలు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. దుకాణాలు మూసివేయడంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా పట్టణంలో పర్యవేక్షించారు. ప్రధాన కూడళ్లలో పలు రాజకీయ పార్టీల నాయకులు, బీసీ సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. బంద్ కారణంగా ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితం కాగా ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో రాకపోకలు సాగించారు. –సాక్షి నెట్‌వర్క్



కుంటాలలో దుకాణాలు మూసివేయిస్తున్న నాయకులు



సారంగపూర్‌లో బంద్‌కు మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు



లక్ష్మణచాందలో బీసీ బంద్‌లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



బోసిపోయిన భైంసా ఆర్టీసీ బస్టాండ్

బంద్.. పాట్లు

- డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- ప్రయాణికులను దోచుకున్న ప్రైవేట్ వాహనదారులు

నిర్మల్‌టౌన్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో బీసీ జేఏసీ శనివారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. జిల్లాలో బంద్ విజయవంతమైంది. ఆర్టీసీ బస్సులు మధ్యాహ్నం 3 గంటల వరకు డిపోలకే పరిమితమయ్యాయి. అత్యవసర సేవలు మినహా అన్నిరకాల సర్వీసులు నిలిచిపోయాయి. వ్యాపారులు స్వచ్ఛందంగా షాపులు మూసివేసి బంద్‌లో పాల్గొన్నారు. ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. పండగ వేళకావడం వరుస సెలవులు రావడంతో ప్రయాణికులపై బంద్ ప్రభావం తీవ్రంగా పడింది. ఇక ఇదే అదనుగా ప్రైవేట్ క్యాబ్ డ్రైవర్లు, ఆటో వాలాలు, ఇతర వాహనదారులు భారీగా చార్జీలు పెంచేశారు. ప్రయాణికులను దోచుకున్నారు. మిగతా రోజులతో పోలిస్తే శనివారం డబల్ చార్జీలు వసూలు చేశారు.



నిర్మల్ బస్టాండ్ పక్కన ప్రైవేట్ వాహనాలు

పండుగ వేళ ఇబ్బంది



పండగ సమయంలో బంద్ ఉండడంతో.. ప్రయాణానికి కాస్త ఇబ్బంది ఎదుర్కొన్నాం. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో.. ఆటో వాళ్లు చార్జీలు సైతం పెంచేశారు. పిల్లలను పట్టుకుని గంటల తరబడి ప్రైవేట్ వాహనాల కోసం వేచి చూడాల్సి వచ్చింది. – లావణ్య, ప్రయాణికురాలు

ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం



బీసీ బంద్‌తో ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికులను డబుల్ చార్జీలతో దోచుకున్నారు. సాధారణ సమయంలో ఇచ్చే చార్జీల కంటే ఎక్కువ చెల్లించి, ప్రయాణాలు చేయాల్సి వచ్చింది. దానికి కూడా పోటీ ఎక్కువగా ఉండడంతో తప్పలేదు. – లక్ష్మి, ప్రయాణికురాలు

గోశాల నిర్వహణపై నిర్లక్ష్యం

- పారిపోయిన ఆవు, మరోదానికి విరిగిన కాలు
- ఈవో తీరుపై దాతల ఆగ్రహం



కాలు విరగడంతో తల్లడిల్లుతున్న ఆవు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో ఏర్పాటు చేసిన గోశాల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఆవులను దానం చేసిన దాతల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఇటీవల గోశాల నుంచి ఓ ఆవు పారిపోగా, తాజాగా మరో ఆవు కాలు విరిగింది. గోశాలలో కొన్ని దూడలు తరచూ.. ఆవులపై దాడి చేస్తున్నాయని ఆలయ ఈవో దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆయన పట్టించుకోకపోవడంతోనే ఆవు కాలు విరిగిందని దాతలు మండిపడుతున్నారు. పలువురు దాతలు ఆవులను గోశాలకు అందించి వాటి సంరక్షణకు ఓ కాపరిని ఏర్పాటు చేశారు. గోశాల నిర్వహణలో తలెత్తుతున్న సమస్యలను ఆలయ అధికారుల పట్టించుకోకనే ఇబ్బందులు తలెత్తుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆలయ ఈవోపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని దాతలు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

సర్కారు బడులకు భవనాలేవి?

- అద్దె ఇళ్లల్లో తరగతుల నిర్వహణ
- మూత్రశాలలు, మరుగుదొడ్లు కరువు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



రాజురాలో అద్దె భవనంలో చదువుతున్న విద్యార్థులు



కుభీర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు

కుభీర్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పాలకులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. కుభీర్ మండలంలోని రాజురా, వాయి, పాతసాంవ్లి గ్రామాల ప్రాథమిక పాఠశాలలకు సొంత భవనాలు కరువయ్యాయి. దీంతో అద్దె భవనాల్లోనే తరగతులు ఏర్పాటు చేసి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. కానీ సదరు అద్దె భవనాల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఒంటికి, రెంటికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సర్కారు బడులకు సొంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై కథనం..

నాలుగు గ్రామాల్లో..

రాజురా ప్రాథమిక పాఠశాలలో 14 మంది విద్యార్థులు ఒక ఉపాధ్యాయురాలు ఉన్నారు. బడి భవనం శిథిలావస్థకు చేరడంతో గ్రామంలోని ఓ గదిని అద్దె తీసుకొని బడి నిర్వహిస్తున్నారు. వాయి ప్రాథమిక పాఠశాలకు భవనం.. గడ్డెన్నవాగు ఒడ్డున ఉంది. వాయి గ్రామం, గడ్డెన్నవాగు పునరావాసం గ్రామం మరోచోట ఏర్పడింది. దీంతో పాఠశాల భవనం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇక్కడ 20 మంది విద్యార్థులు చదువుతుండగా ఒక టీచర్ పనిచేస్తున్నారు. పాతసాంవ్లి సైతం పునరావాస గ్రామం కావడంతో పాఠశాల భవనం నీళ్లలోనే ఉంది. కొత్తగా ఏర్పడిన గ్రామంలో మూడు గదులు అద్దెకు తీసుకొని తరగతులు నిర్వహిస్తున్నారు. పాతసాంవ్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నలుగురు టీచర్లు 100 మంది విద్యార్థులు, కుభీర్‌లో పంచాయతీ కార్యాలయ సమీపంలో ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ఆవరణలో షెడ్డు వేసి 15 మంది విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు.

మూతబడ్డ మూడు పాఠశాలలు..

విద్యార్థుల సంఖ్య లేక మండలంలోని హల్దా తండా, పెర్వెల్లి, పాంగర్‌పహాడ్ పాఠశాలలు మూతపడ్డాయి. ఈవిషయమై ఎంఈవో ఆర్.విజయ్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులకు అ ద్దెను స్కూల్ గ్రాంట్ నుంచి చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులూ సహకరిస్తున్నారని వివరించారు.

'సాక్షి'పై కక్షసాధింపు సరికాదు



కుంటాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



దిలావర్‌పూర్‌లో వినతి పత్రం అందిస్తున్న భూమయ్య, జర్నలిస్టులు

కుంటాల: ఆంధ్రప్రదేశ్‌లో సాక్షిపై దాడిని ఖండిస్తూ శనివారం కుంటాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, నాయకులు కొత్తపల్లి బుచ్చన్న, కిరణ్ కొమ్రేవార్, జుట్టు మహేందర్, పడకంటి దత్త్రాద్రి, దొనికెన వెంకటేశ్, ప్రెస్‌క్లబ్ కన్వీనర్ రవికుమార్, సభ్యులు రాజు తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను కాలరాయాలనుకోవడం మూర్ఖత్వమని టీయూడబ్ల్యూ(ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్య అన్నారు. సాక్షి దినపత్రికపై కక్షసాధింపు చర్యలను నిరసిస్తూ దిలావర్‌పూర్ మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ తీశారు. ఈసందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. భూమయ్య మాట్లాడుతూ సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిని వేధించడం సరికాదని.. ఇప్పటికైనా అక్రమ కేసులు ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఇందులో దిలావర్‌పూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బూస మచ్చేందర్, ప్రధాన కార్యదర్శి ఆయిటి పోశెట్టి, గౌరవ అధ్యక్షుడు రాజు, గౌరవ సలహాదారులు రామ్‌సాగర్, మోగేశ్, దుప్పి సిద్ధార్థ, కోశాధికారి ఎన్.సుకేశ్, సభ్యులు భోజన్న, ముత్యం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



కడెంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కడెం: ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం 'సాక్షి' దిన పత్రికపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, సీపీఐ(ఎంఎల్)కార్యదర్శి సునారికారి రాజేశ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో జర్నలిస్టులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భూషణం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేష్, వెంకన్న, లింగన్న, జర్నలిస్టులు రవీందర్, రమేశ్, రంజిత్, వెంకటేశ్, విజయ్, దశ తదితరులు ఉన్నారు.

కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఖానాపూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సీపీఎం, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో శనివారం కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్ల విషయమై బీజేపీ రెండు నాలుకల ధోరణిని అవలంబిస్తూ బీసీలకు అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నంది రామయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్, నర్సయ్య, తిరుపతి, నారాయణ, శ్రీనివాస్, రాజన్న, గోరె మియ్యా, ఎర్రన్న తదితరులు ఉన్నారు.

యాప్‌తో ఇబ్బందులు

కుంటాల: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా ప్రవేశపెట్టిన కిసాన్ కపాస్ యాప్‌తో రైతులకు ఇబ్బందులు తప్పవని సింగిల్‌విండో మాజీ చైర్మన్ కుమ్మరి భాస్కర్ పేర్కొన్నారు. శనివారం కుంటాలలో విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాలతో సగం పత్తి చేన్లు దెబ్బతిన్నాయన్నారు. పండించిన పంటను అమ్ముకునేందుకు స్లాట్ బుక్ విధానం తీసుకురావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. షరతుల్లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతులు సోమ రాములు, పట్లే గజ్జారాం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నర్సాపూర్(జి): మండలకేంద్రానికి చెందిన లైబ్రేరియన్ కట్కం సంజీవ్‌రెడ్డి తల్లి రాజుబాయి ఇటీవల మృతిచెందింది. శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు సమత సుదర్శన్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, తక్కల విద్యాసాగర్‌రె డ్డి, సాయికృష్ణ, అనిల్, ముత్యం తదితరులు ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలు బాధిత కుటుంబాలను శనివారం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. కొట్ల(బి) గ్రామానికి చెందిన మేరు లస్మవ్వ, మంచాల నర్సవ్వ మృతిచెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. అలాగే దేవితండాకు చెందిన జాదవ్ బలిరామ్ మృతిచెందగా ఆయన కుమారుడు ప్రకాశ్‌ను పరామర్శించారు. ఆయన వెంట అడెల్లి ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజ్‌మహ్మద్, నాయకులు నర్సారెడ్డి, రాజేశ్వర్‌రావు, బట్టు భోజన్న, అట్ల ముత్యంరెడ్డి, వంగ ప్రభాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

ముధోల్: ముధోల్ మండల బీసీ జేఏసీ అఖిల పక్ష కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ముధోల్‌లో జరిగిన ఎన్నికలో మండల అధ్యక్షుడిగా బోయిడి అనిల్, ఉపాధ్యక్షులుగా సాపేవార్ కిష్టయ్య, గడ్డం సుభాశ్, ప్రధాన కార్యదర్శిగా రావుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా రుమెల్ల జీవన్, సలహాదారులుగా రవికిరణ్‌గౌడ్, మైత్రి సాయినాథ్, దత్త్రాత్రి, కిషన్‌పటేల్ ఎన్నికయ్యారు. మండలంలో బీసీల ఐక్యత కృషి చేస్తామని అధ్యక్షుడు అనిల్ పేర్కొన్నారు.

టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న ఏడీ రామచంద్రుడు

ఖానాపూర్: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధకశాఖ ఖానాపూర్ ఏడీ రామచంద్రుడు అన్నారు. శనివారం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో పశువులకు గాలికుంటు టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. జాతీయ పశువ్యాధి నియంత్రణలో భాగంగా నెలరోజులు టీకాలు వేస్తామని ఏడీ పేర్కొన్నారు.

పాఠశాలలో గాజుల పండుగ



గాజులు వేసుకుంటున్న తల్లులు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం గాజుల పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు. శనివారం పేరెంట్స్ డే నిర్వహించాల్సి ఉండగా, బీసీ సంఘాల బంద్ నేపథ్యంలో వాయిదా వేశారు. ఈ విషయం తెలియక పాఠశాలకు చేరుకున్న విద్యార్థినుల పేరెంట్స్‌కు ఉపాధ్యాయులు పలు రకాల పోటీలను నిర్వహించారు. దీపావళి ధన త్రయోదశి సందర్భంగా గాజులు పంపిణీ చేసి పండుగ నిర్వహించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధ పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న రామారావు పటేల్

భైంసాటౌన్: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో నిర్మించే మార్కండేయ ఆలయానికి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం భూమిపూజ చేశారు. ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరై శంకుస్థాపన చేశారు. దేవాదాయ,ధర్మాదాయ శాఖ సీజీఎఫ్ నిధులు రూ 32 లక్షలతోపాటు సంఘ సభ్యుల విరాళంతో కలిసి రూ.40 లక్షలతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు సట్లవార్ మహేశ్, సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్–1 ర్యాంకర్‌కు సన్మానం

భైంసాటౌన్/బాసర: బాసర మండలంలోని కిర్గుల్(బి) గ్రామానికి చెందిన కారండే మహేందర్ ఇటీవల గ్రూప్–1 ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యారు. శనివారం భైంసా పట్టణంలో ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మహేందర్‌ను అభినందించి సన్మానించా రు. ముధోల్ ప్రాంతం నుంచి గ్రూప్–1 ర్యాంకు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కుంటాల: భైంసా నుంచి సుంక్లి, లింబా(కె),లింబా(బి), ఓలా, కుంటాల మీదుగా ఆదర్శ పాఠశాల వరకు ఆర్టీసీ బస్సు నడిపించాలని ప్రిన్సిపాల్ ఎత్రాజ్ రాజు శనివారం భైంసాలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు, డీఎం హరిప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

అంజన్న ఆలయానికి దారేది..?



దారిలోనే చెత్తాచెదారం

భైంసాటౌన్: పట్టణ శివారులోని మహాగాం మార్గంలో కమలాపూర్‌లో నెలకొన్న దక్షిణముఖి హనుమాన్ ఆలయానికి వెళ్లే దారి అధ్వానంగా మారింది. ఆలయ మార్గంలో మున్సిపల్ డంపింగ్ యార్డు ఉండగా పట్టణంలో సేకరించిన చెత్తను ఇష్టారీతిన పడేస్తున్నారు. దీంతో చెత్తతోపాటు జంతు, పశువుల వ్యర్థాలు రోడ్డుపైకి చేరడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. ప్రతి మంగళ, శనివారాల్లో, ప్రత్యేక దినాల్లో అధిక సంఖ్యలో భక్తులు ఈ హనుమాన్ ఆలయానికి వెళ్తుంటారు. ఇటువైపు పంట చేలు ఉన్న రైతులు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై పలువురు భక్తులు మున్సిపల్ అధికారులకు విన్నవించినా మార్పు లేదు. ఇప్పటికైనా ఆలయ మార్గంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.